

కాళేశ్వరం కాలువకు మరోసారి

భూసేకరణ

- 27వ నంబర్ హైలెవల్ కాలువ కోసం 250 ఎకరాలు
- 28వ నంబర్ హైలెవల్ కాలువకు మరో 200 ఎకరాలు
- చెల్లింపు నిధులపై గందరగోళం
- భూసేకరణ పనులు మొదలుపెట్టాలంటూ కలెక్టర్ ఆదేశం
- అయోమయంలో అధికారులు

నిర్మల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గంలో 50 వేలు, ముథోల్ నియోజకవర్గంలో మరో 50 వేలు.. మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం హైలెవల్ కాలువలు 27,28వ నంబర్ ప్యాకేజీల కోసం అదనంగా అవసరమవుతున్న భూమిని సేకరించాలంటూ కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలు ఇరిగేషన్‌శాఖలో అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. యుద్ధ ప్రాతిపదికన 27వ కాలువకు సంబంధించి 250 ఎకరాలు, 28వ నంబర్ హైలెవల్ కాలువకు సంబంధించి 200 ఎకరాల భూసేకరణను చేపట్టాలని కలెక్టర్ స్పష్టంగా ఆదేశించినప్పటికి ఈ భూసేకరణ ప్రక్రియకు సంబంధించి నిధులు అందుబాటులో లేవంటూ ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేస్తేనే చెల్లింపుల ప్రక్రియ జరిగే అవకాశం ఉంటుందని లేనట్లయితే భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించే అవకాశం ఉండదంటూ ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే మొదట ప్యాకేజీ నంబర్ 28వ హైలెవల్ కాలువ కోసం 16 గ్రామాల్లో భూసేకరణ చేపట్టాలంటూ కలెక్టర్ ఆదేశించారు. ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారులు కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే నాలుగు గ్రామాల్లో హైలెవల్ కాలువల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ సర్వే పూర్తి చేశారు. మిగతా 12 గ్రామాల్లో కూడా భూసేకరణకు సంబంధించి సర్వే పనులను పూర్తి చేసేందుకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా 27వ నంబర్ హైలెవల్ కాలువకు సంబంధించి 250 ఎకరాల భూసేకరణ దిలావర్‌పూర్ మండలంలోని గుండంపెల్లి, కాల్వ, న్యూలోలంతో పాటు నర్సాపూర్(జి)మండలంలోని తురాటి భామ్ని(బి), అంజని తాండ, కుంటాల మండలంలోని అందకూర్, విఠాపూర్, లింబా(కె), లింబా(బి), మెదన్‌పూర్, దౌనెల్లి గ్రామాల్లో భూసేకరణ జరపాల్సి ఉంది. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు మొదట 28వ నంబర్ ప్యాకేజీ కాలువకు సంబంధించి 16 గ్రామాల్లో భూసేకరణకు సంబంధించిన సర్వేను పూర్తి చేయాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా నాలుగు గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తి కాగా మిగతా గ్రామాల్లో సర్వేను పూర్తి చేసి 27వ నంబర్ ప్యాకేజీ కాలువ కోసం భూసేకరణ చేపట్టాలని భావిస్తున్నారు.

28వ నంబర్ ప్యాకేజీపై ప్రత్యేక దృష్టి

కాగా దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి కొనసాగుతున్న 28వ నంబర్ హైలెవల్ కాలువ పనులు ఎడతెగకుండా కొనసాగుతున్నాయి. నిధుల కొరతతో పాటు సరియైన ప్రణాళికలు లేకపోవడం, భూసేకరణ ప్రక్రియ ఆలస్యంగా జరగడం లాంటి అనేక అవరోధాలతో ఈ కాలువ పనులు ఏళ్ల నుంచి పూర్తి కావడం లేదు. ఈ కాలువ కింద 50 వేల ఎకరాలు సాగును లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఎక్కడా కూడా అదనపు ఆయకట్టును సృష్టించలేకపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ కాలువల నిర్మాణ పనులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచిపోయినప్పటికీ ఇప్పటికి ఈ కాలువ పనులు పూర్తి కాలేదు. అయితే తాజాగా కలెక్టర్ భూసర్వేకు ఆదేశించడంతో సంబందిత అధికారులు ఆ దిశగా చర్యలు మొదలుపెట్టారు. ఇప్పటికే భైంసా మండలంలోని అంపోలి(కె)లో 9.06 ఎకరాలు, బోరిగాం గ్రామంలో 12.01 ఎకరాలు, మాటేగాం గ్రామంలో 9.11 ఎకరాల భూసేకరణ ప్రక్రియకు సంబంధించిన సర్వే పూర్తి చేశారు. కాగా అంబకంటి గ్రామంలో 15.04ఎకరాల భూమిని కూడా ఈ కాలువల కోసం సర్వే చేసిన అధికారులు మరో 12 గ్రామాల్లో కూడా భూసేకరణ జరిపేందుకు సిద్దమవుతున్నారు. ఈ భూసేకరణ సర్వేకు సంబంధించిన పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందించిన తరువాత 27వ ప్యాకేజీ హైలెవల్ కాలువ పరిధిలోని భూసేకరణ ప్రక్రియకు సంబంధించి సర్వేను చేపట్టనున్నారు.

ప్రహసనంగా ప్యాకేజీ 27వ హైలెవల్ కాలువ వ్యవహారం

కాగా నిర్మల్ నియోజకవర్గంలో 50వేలకు ఎకరాలకు అదనంగా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన కాలేశ్వరం 27వ నంబర్ హైలేవల్ కాలువ పనులు ప్రహసనంగా మారుతున్నాయి. దాదాపు పదిహేనేళ్ల నుంచి కొనసాగుతున్న ఈ పనులు ఇప్పటికి పూర్తికాకపోతుండడం విమర్శలకు తావిస్తోంది. ఈ హైలెవల్ కాలువ కోసం మొదట రూ. 714 కోట్ల నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్ రూ.445 కోట్ల రూపాయల విలువైన పనులను పూర్తి చేశారు. అప్పటి ప్రభుత్వం పనులకు సంబంధించి బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులు చేయకుండా చేతులెత్తేశాడు. దీంతో పాటు భూసేకరణ ప్రక్రియను కూడా ప్రభుత్వం పూర్తి చేయని కారణంగా పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత మళ్లీ 2021 సంవత్సరంలో 332.64 కోట్ల రూపాయలతో ప్రభుత్వం మళ్లీ టెండర్‌లను పిలిచింది. ఈ పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు 105 కోట్లను మాత్రమే పనుల కోసం వ్యయం చేశారు. అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాల్లో పనులను పూర్తి చేయాలన్న నిబంధన ఉన్నప్పటికి ఇప్పటి వరకు పనులు పూర్తికాకపోవడంతో ప్రభుత్వం మే చివరి వరకు గడువును పొడగించింది. అప్పటి వరకు భూసేకరణకు సంబందించిన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని అంటున్నారు.

వెంటాడుతున్న నిధుల సమస్య

కాళేశ్వరం హైలెవల్ 27,28వ నంబర్ ప్యాకేజీ పనులను మొదటి నుంచి నిధుల కొరత వెంటాడుతుంది. దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి ఈ రెండు కాలువల పనులు అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూ సాగుతున్నాయే తప్ప ఇప్పటి వరకు వీటి పనులు మాత్రం పూర్తి కావడం లేదంటున్నారు. మొదట భూసేకరణ ప్రక్రియ నిర్వహణ పనులకు అనేక అవాంతరాలు సృష్టించింది. ఆ తరువాత సక్రమంగా నిధులు విడుదలకాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనుల పూర్తికి వెనకడుగు వేయడమే కాకుండా పనులు చేపట్టలేమంటూ వెనుదిరిగారు. అయితే ఇతర కాంట్రాక్ట్ సంస్థలను పనులు చేపట్టేందుకు ఒప్పించినప్పటికీ ఆ సంస్థలు కూడా కొంత మేరకు పనులు చేసి చేతులెత్తేశాయి. అటు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ఈ రెండు కాలువల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు తంటాలు పడుతున్నప్పటికి ప్రభుత్వం పూర్తయిన పనులకు సంబంధించి గానీ భూసేకరణకు సంబంధించి గానీ ఎప్పటికప్పుడు నిధులను విడుదల చేయకపోతుండడం ఈ కాలువలకు శాపంగా మారుతోందని అంటున్నారు.

హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకోండి

- సహజరంగులు వాడండి • ప్రమాదాలకు దూరంగా ఉండండి : ఎస్పీ



నిర్మల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు హోలీ పండగను ఉత్సాహంగా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ జానకీషర్మిల పిలుపునిచ్చారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజలకు ఎస్పీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. సహజరంగులు ఉపయోగించాలని, ఆరోగ్యానికి మేలు అన్నారు. ఎదుటి వారికి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. మహిళల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం సేవించి అతివేగంగా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. సాంప్రదాయ పండగలను ప్రజలంతా కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. రగులు చల్లుకునే సమయంలో తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కనిపెట్టాలని, వారిపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బాసరలో కామదహనం



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద కామదహన దృశ్యం

బాసర, మార్చి, 13 : (ఆంధ్రజ్యోతి) : హోలీ పండుగకు ముందు రోజు జరుపుకునే కామదహనం గురువారం బాసర మండల కేంద్రంలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. గ్రామంలో పలు చోట్ల ప్రధానవీధుల్లో గ్రామస్థులు కామదహనం కార్యక్రమం నిర్వహించారు. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద సైతం సంప్రదాయంగా ఆలయ పండితులు పూజలు నిర్వహించి కామదహనం జరిపారు. ఈ సందర్భంగా ప్రతీచోట గ్రామస్థులు పాల్గొని కాముడి వద్ద పూజలు నిర్వహించారు. కామదహనం తర్వాత ఏర్పడ్డ బూడిదతో హోలీపండుగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది.

ముథోల్ మండలం చించాలలో..

ముథోల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, చించాల, వెంకటాపూర్, ఎడ్‌బిడ్, కారేగాం, చింతకుంట తదితర గ్రామాల్లో గురువారం రాత్రి కామ దహనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద పిడుకలు పేర్చి పిల్లలు జాజిరి ఆడిన జాజిరి కోలాలు తదితర వాటిని పేర్చి కామదహనం ఘనంగా నిర్వహించారు. అనంతరం కామ దహనం నుండి నిప్పు రవ్వలను ఇంటికి తీసుకువెళ్లి ఆ నిప్పు రవ్వలపై శనిగలను కాల్చి తినడం ఆనవాయితీ. ఇలా చేయడం వల్ల కుటుంబంలోని సభ్యులందరూ సుఖ సంతోషాలతో ఉంటారని వారి నమ్మకం. ప్రజలకు శుక్రవారం హోలీ పండగ జరుపుకోనున్నారు.

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు



ముథోల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠ శాల, అక్షర, రబింద్ర పాఠశాల, మండ లంలోని ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్, భాష్యం, వివేకానంద, శ్రీవిద్యా, తదితర పాఠశాలల్లో గురువారం ముందస్తు హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రహ్లాదున్ని, శ్రీకృష్ణ రాధాలను పూజించి హోలికా దహనం చేశారు. అనంతరం హోలికా దహనం, రంగోలి పండగల చారిత్రక నేపథ్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆనందంతో గంతులేస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేస్తూ రంగులను చల్లుకున్నారు.

అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతి సభను

విజయవంతం చేయండి

ఖానాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నేడు ఖానాపూర్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర సమర యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎల్లాపి కుల సంఘం జిల్లా అధ్యక్షులు పుప్పాల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్మాల శోభన్‌రావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సాయంత్రం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఎల్లాపి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర రావు పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో, జిల్లా కేంద్రాల్లో ప్రభాకర్ రావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండల నలుమూలల నుండి కుల సంఘం సభ్యులు పెద్ద ఎత్తున హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

వీధి దీపాలు లేక పార్‌పెల్లిలో చిమ్మ చీకట్లు

లక్ష్మణచాంద, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో వీధిదీపాలు లేని కారణంగా ఒక వీధిలో చిమ్మ చీకట్లు ఏర్పడుతున్న పరిస్థితి గత వారం రోజులుగా కొనసాగుతున్నట్లు గ్రామస్థులు గురువారం రాత్రి ఆంధ్రజ్యోతితో తమ గోడును వెల్లబోసుకున్నారు. విద్యుత్ అధికారులు సహకరించినప్పటికీ స్థానిక అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేయటంలో అశ్రద్ధ చూపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కావునా అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సీఎం చేతుల మీదుగా
నియామక పత్రాలు అందుకున్న అధ్యాపకులు

లక్ష్మణచాంద, మార్చి 13 (ఆంధ్రజ్యోత) : మండలంలోని పార్‌పెల్లి గ్రామానికిచెందిన రాజారం శ్రీకాంత్, బాబాపూర్ గ్రామానికి చెందిన బుర్క రాజేందర్‌లు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ అధ్యాపకులుగా నియామక పత్రాలు అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావటం పట్ల తోటి స్నేహితులు, గ్రామస్థులు గురువారం అభినందనలు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత



పట్టుకున్న ఇసుక లారీతో తహసీల్దార్ లింగమూర్తి

తానూర్, మార్చి, 3 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జవులా (బీ) వద్ద మహారాష్ట్ర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు తహసీల్దార్ లింగమూర్తి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి ధర్మబాద్ నుంచి వస్తున్న ఇసుక లారీ జవులా (బీ) వద్ద ఇసుక ఖాళీ చేస్తుండగా పక్కా సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి లారీని పట్టుకొని పోలీసుస్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందించినట్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్

నిర్మల్ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఈఆర్‌వోలతో గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించే కలెక్టర్లతో పాటు ఈఆర్‌వోలు తమ తమ స్థాయిలలో పొలిటికల్ పార్టీ మీటింగ్‌లు ఏర్పాటు చేసి అప్డేట్స్ అందించాలన్నారు. సమావేశాలు తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ ముందస్తుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, సమావేశాల వివరాలను సీఈవో కార్యాలయానికి, గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు పంపించాలని సూచించారు. కాగా ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంటది వెంట పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని సీఈవో సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, ఈఆర్‌వోలు

లెప్రసి కేస్ డిటెక్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : లెప్రసి కేస్ డిటెక్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో లెప్రసి కేస్ డిటెక్షన్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందించినట్లయితే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చునని, అదేవిధంగా వ్యాధి ఇతరులకు వ్యాపించకుండా అడ్డుకోవచ్చునని తెలియజేశారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు లెప్రసి కేస్ డిటెక్షన్ కార్యక్రమం కొనసాగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు వ్యాధిని గుర్తించడానికి ప్రతి ఒక్కరిని పరీక్షించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, లెప్రసి కేసులు గుర్తించి, చికిత్సలు అందించాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారే రవీందర్, డిప్యూటీ పీఎంవో రాజేశ్వర్, ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు, జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షక అధికారులు పాల్గొన్నారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి

- భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్‌రావ్ పాటిల్

భైంసా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు పశు సంతతి వృద్ధి కోసం వాటి పోషణ ప్రక్రియలో మెళకువలు పాటించాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసా మండలంలోని చుచుంద్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. రైతన్నలు పంటల సాగుతో పాటు లాభాదాయమైన పాడి పరిశ్రమ వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులతో పశు సంతతి తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వాటి వృద్ధి కోసం ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టాలన్నారు. భైంసా పశువైద్యాధికారి డా. విఠల్ వేసవి కాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులు,వాటి నివారణ చర్యలు, వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై రైతన్నలకు అవగాహన కల్పించారు. డా. విఠల్ నేతృత్వంలో పశువైద్య సిబ్బంది మూగజీవాలకు అవసరమైన చికిత్సలు అందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువులకు అవసరమైన మందులను రైతన్నలకు అందచేశారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్, కార్యదర్శి పున్య నాయక్‌తో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతన్నలు పాల్గొన్నారు.



పశువుల మందులను రైతన్నలకు అందచేస్తున్న ఏఎంసీ చైర్మెన్

రేపటి నుంచి ఒంటి పూట బడులు

నిర్మల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలు శనివారం నుంచి ఒంటి పూట నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 13:30 గంటల వరకు నిర్వహించాలన్నారు. పది పరీక్షా కేంద్రాలున్న పాఠశాలలు పరీక్షలు పూర్తయ్యే వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం 12:30 గంటలకు నిర్వహించాలన్నారు.

'ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీలేదు'

నిర్మల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ పురపాలక సంఘ పరిధిలో 2024-2025 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుపై ఎలాంటి వడ్డీ మాఫీ లేదని కమిషనర్ జగదీష్‌గౌడ్ తెలిపారు. గురువారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారన్నారు. అన్ని రకాల ఆస్తి పన్నులు ఈ నెల 31 లోగా చెల్లించాలని లేనట్టయితే మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. సకాలంలో పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ



స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనర్లు

ముథోల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో 100 రోజులు పని పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కుటుంబాలకు మండలంలోని తరోడా రైతువేదికలో గురువారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ట్రైనర్లు శివకుమార్, సౌమ్య, రమేష్‌లు ఉన్నతి అభ్యర్థులకు వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన కల్పించారు. వచ్చిన వారి పేర్లు రిజిస్ట్రేషన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ రెండు వారాల పాటు జరుగనుంది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీవో శిరీషారెడ్డి, ఏపీఎం గురుచరణ్, సీసీలు పోశెట్టి, సూర్యకాంత్, ఉన్నతి అభ్యర్థులు, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

15న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అన్ని పాఠశాలల్లో ఈ నెల 15న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయ సమావేశం నిర్వహించాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎజెండా ప్రకారం అంశాలు చేర్చించాలని, ఫలితాల సాధన ప్రగతి, హాజరు వివరాలు చర్చించి ప్రగతిని ప్రశంసించాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు ఐఎస్ఎంఎస్ పోర్టల్, స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ ఉత్తీర్ణులైన జిల్లాలోని బీసీ అభ్యర్థులు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ ఉద్యోగ కల్పనకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ సంస్థ ద్వారా నెల రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన తదుపరి ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారు. డిగ్రీ పూర్తయి 26 ఏళ్ల లోపు వయసు వారు ఈ నెల 15 నుండి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08732 - 221280ను సంప్రదించాలని తెలిపారు.

16న బాసరలో అష్టావధానం

ముథోల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16న బాసరలోని శారదానగర్‌లో బొల్లాప్రగడ శశిశర్మచే అష్టావధానం నిర్వహిస్తున్నామని బి. వెంకట్‌కవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా భూమారెడ్డి జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

తలమడుగు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుయాడి గ్రామంలో విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి 71వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి లోక నేత జీవనప్రస్థానం పుస్తకాన్ని ముఖ్య అతిథిగా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల నుంచి ఉద్భవించే నాయకుల తరం లోక భూమారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా లోక భూమారెడ్డి మాట్లాడుతూ ప్రజానాయకునిగా పేరు సంపాదించడం తనకు తృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఈశ్వరి బాయి, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అయ్యే వరకూ

గ్రూప్స్ ఫలితాలు ఆపాలి : ఎమ్మార్పీఎస్

నార్నూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వపరంగా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత అయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1, 2, 3 ఫలితాలను ఆపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఉదయ్ కాంబ్లే డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాంగ్ కులానికి(బీ) గ్రూప్‌లో చేర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్న బాహసాటే మండల అధ్యక్షులు కోరల మహేందర్, విజయ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మాదిగ రిజర్వేషన్లను అమలు చేస్తూ చట్టబద్ధత కల్పించే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం ముఖ్యమంత్రి ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుని పిలుపుమేరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడా స్వామి మాదిగ పేర్కొన్నారు.

సోనాల గ్రామంలో తీవ్రమైన మంచినీటి ఎద్దడి

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సోనాల గ్రామంలో తీవ్రమైన మంచినీటి ఎద్దడి నెలకొందని ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అధికారులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సోనాల మండల కేంద్రమైన చెందిన నాయకులు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్ బి. మురళీధర్‌లు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ మల్లేష్‌కు ఈ విషయమై వినతి పత్రం అందించారు. గ్రామం పరిసరాల్లో ఉన్న వాగు పూర్తిగా ఎండిపోయిందని ఫలితంగా బోరు బావుల్లో భూగర్భ జలాలు ఇంకిపోయారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వసంతరావు, సుభాష్, సూర్య, నడిపి గంగారం, పాటిల్ భీమ్రావు, శివయ్య, అమృత రావు, శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

'బోథ్ బస్టాండ్ పాత మ్యాపును ఇవ్వండి'

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బోత్ బస్టాండ్ నిర్మాణం సందర్భంగా ఉన్న పాతమ్యాపును ఇవ్వాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి నిర్మల్ డిపో మేనేజర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన డిపో మేనేజర్‌కు లేఖను రాసినట్లు వివరించారు.

కామాట్‌వాడ పాఠశాలపై జిల్లా విద్యాశాఖ అధికారుల ఆరా

● పాఠశాలను వెళ్లి.. వివరాలు సేకరించిన ఎంఈవో శ్యాంసుందర్ ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కామాట్‌వాడ పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈవో శ్యామ్‌సుందర్

బీంపూర్ , మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బీంపూర్ మండలం కమట్‌వాడ పాఠశాలలో 'తరగతులు ఐదు.... విద్యార్థులు 11 మందే..' అన్న శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురణ కావడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం పాఠశాలపై నిర్వహణ తీరుపై ఆరా తీశారు. వెంటనే పాఠశాలకు సంబంధించిన వివరాలు పంపాలని మండల విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో ఎంఈవో శ్యాంసుందర్ వెంటనే కామాట్‌వాడ పాఠశాలకు వెళ్లి తనిఖీ చేసి పాఠశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలని ఆదేశించారు. అంతేకాకుండా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని సూచించారు. కాగా కామట్‌వాడ పాఠశాల వివరాలను జిల్లా అధికారులకు వివరిస్తానని ఆయన తెలిపారు.

సోనాల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం ఏర్పడింది. వచ్చిన నిధులు ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. నిధుల దుర్వినియోగం విషయమై పాఠశాలకు గురువారం వెళ్లిన నాయకులు నిధుల విషయమై ఉపాధ్యాయులను ప్రశ్నించారు.

అయితే విధి నిర్వహణలో ఉండాల్సిన ప్రధానోపాధ్యాయుడు లేక పోగా ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు సామాగ్రి కొనుగోలుకు వెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారని గ్రామస్థులు చెప్పారు. అయితే కొంతమంది ఉపాధ్యాయులు నిధులు వచ్చిన విషయం తమకు తెలియదన్నారని గ్రామస్థులు తెలిపారు. పాఠశాలకు వచ్చిన నిధులను సమిష్టిగా చర్చించి ఖర్చు చేయాల్సింది పోయి కొంతమంది ఉపాధ్యాయుల ఇష్టానుసారంగానే నిధులు ఖర్చు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మధ్యాహ్న భోజనం విద్యార్థుల కోసం నిర్మించిన డైనింగ్ హాల్ అస్తవ్యస్తంగా మారిందని విద్యార్థులు కూర్చునేందుకు వీలులేదని గ్రామస్థులు గుర్తించారు. మంజూరు అయిన నిధులు వెచ్చించిన ఖర్చుల గురించి పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని గ్రామపెద్దలు ఉపాధ్యాయులకు సూచించారు. తాము మరోసారి పాఠశాలలను సందర్శిస్తామని ఆ సమయంలో పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని గ్రామస్థులు ఉపా ధ్యాయులకు వివరించారు. పాఠశాలను సందర్శించిన వారిలో మాజీ ఎంపీపీ వీడీసీ అధ్యక్షులు తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భీమ్రావు, మాజీ ఉపసర్పంచ్ కే మురళీధర్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు ఉన్నారు.

తగిన జాగ్రత్తలు పాటిస్తూ హోలీని జరుపుకోవాలి : ఎమ్మెల్యే

నేరడిగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : హోలీ పండుగ సందర్భంగా మండల ప్రజలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ఉత్సవం జరుపుకునేవారు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రమాదాలకు దూరంగా ఉండాలని, ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్లరాదని సూచించారు. సంప్రదాయ రంగులు ఉపయోగించడం ఆరోగ్యకరమని తెలిపారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా ఉత్సవం జరుపుకోవాలని, సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలి అన్నారు. నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండ తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు.

నాగభూషణం పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో గురువారం ముందస్తు హోలీ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగులు చల్లుకొని హోలీ సంబరాలను జరుపుకున్నారు. ప్రమాదకరమైన కెమికల్లతో కూడిన రంగులను చల్లుకోవద్దని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్ విద్యార్థులకు సూచించారు. అనారోగ్యానికి గురికాకుండా కళ్ళలో రంగులు పడకుండా రంగులు ఆడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

దన్నూర్ ప్రాథమిక పాఠశాలలో హోలీ సంబరాలు

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు ఒకరోజు ముందుగానే హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల రంగులు చల్లుకొని పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు హోలీ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కెమికల్స్‌తో కూడిన రంగులను చల్లుకోవద్దని కంట్లో రంగులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

నిరుపేద మహిళకు అండగా నిలిచిన అటవీశాఖ సిబ్బంది

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బోథ్ రేంజి పరిధిలోని చింఛోలి ప్రాంతంలో కట్టెలు ఏరుకునేందుకు వెళ్లిన మహిళ కంటికి కట్టే తగిలి తీవ్ర గాయం అయింది. అయితే వారం రోజుల నుంచి మహిళ కంటి నుంచి నీరు రావడంతో పాటు తీవ్రమైన నొప్పి ఉండడంతో మహిళ తీవ్ర ఇబ్బందులకు గురైంది. విషయం గమనించిన అటవీ శాఖ అధికారి ప్రణయ్ గురువారం మహిళ ఆర్థిక పరిస్థితిని గమనించి స్థానికంగా ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రంలో వైద్య చికిత్సలు జరిపించారు. అనంతరం ఆమెకు ఒక నెలకు సరిపడా నిత్యవసర సరకులను అందించడం జరిగింది. మానవత దృక్పథంతో అటవీ శాఖ అధికారి అందించిన సహాయాన్ని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి నాగో రావు, జూనియర్ అసిస్టెంట్ పరశురాం, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి టీఎన్జీవోస్ పక్షాన పోరాడుతున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సంద అశోక్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ టీఎన్జీఓ సంఘం తాలూకా టేబుల్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, తాలూకా అధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి అరుణ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మావల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మావల మండల కేంద్రానికి చెందిన కొజ్జూరు రంజిత్ (35) మేస్త్రిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి పడుకునే సమయంలో కూలర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచండి

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్యను పెంచాలని వంద రోజులు పనిదినాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ టీఏలు ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం పనులకు వెళ్లి 10 గంటల లోపు పనులు పూర్తి చేసుకుని తిరిగి రావాలని కూలీలను కోరారు. పని ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జగ్గీరావు ఉన్నారు.

నిరుద్యోగుల కోసమే రాజీవ్ యువ వికాసం పథకం

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల, సీనియర్ నాయకులు షేక్ అబూద్‌లు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమస్యలు మాట్లాడుతూ మార్చి 15 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక సాయం పొందేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బోథ్‌లో చలివేంద్రం ఏర్పాటు

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన మీర్షద్ అలీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన ఎండల వల్ల ప్రజల దాహార్తి తీర్చాలని అభిప్రాయంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదిలాబాద్‌లో పోలీసుల తనిఖీలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14న హెలీ పండుగని పురస్కరించుకుని ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు సీఐ ప్రణయ్ కుమార్ తెలిపారు. ఉదయం నుంచే తనిఖీలు కొనసాగుతాయన్నారు.

ఘనంగా కామ దహనం

తలమడుగు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను పురస్కరించుకొని గురువారం రాత్రి తల మడుగు మండల కేంద్రంలో ఘనంగా కామ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరి గ్రామ పెద్ద ఇంటి నుంచి భాజాభజంత్రీలతో ర్యాలీగా వెళ్లి స్థానిక హను మాన్ మందిరం సమీపంలో పిడకలు, కట్టెలు ఇతర వస్తువులతో తయారు చేసిన కామ దహన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించారు. ఇందులో గ్రామ పెద్దలు మంతే రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి పద్మాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంటి తదితరులు పాల్గొన్నారు.


చెట్టు కాండానికి గణనాథుని ఆకారం



జువ్వి జట్టుకు గణనాథుని ఆకారం.. పూజలు చేస్తున్న గ్రామస్థులు

కుంటాల, మార్చి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల జువ్విజట్టుకు గణనాథుని పోలిక కనిపించడంతో గ్రామస్థులు ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి నుండి గణనాథుని ఆకారాన్ని గుర్తించిన గ్రామస్థులు గురువారం ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఈ చెట్టుకు ఇలా గణనాథుని ఆకారం ఏర్పడడంతో తమ గ్రామస్తులకు మేలు చేకూరుతుందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుండి సైతం సూర్యాపూర్ వెళ్లి పూజలు నిర్వహించారు.

కౌట్ల (బి)లో అటవీ అభివృద్ధిపై సర్వే



అటవీ ప్రాంత అభివృద్ధి కోసం సర్వే చేస్తున్న అధికారులు

సారంగాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల కౌట్ల(బి) గ్రామ సమీపంలో ఉన్నటువంటి అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి గురువారం బెంగళూరుకు చెందిన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ సంపత్‌తో పాటు అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతాన్ని సర్వే నిర్వహించి, అటవీ ప్రాంత అభివృద్ధిపై అటవీ శాఖ అధికారులకు పలు సూచనలను ఇచ్చి గడ్డి జాతుల పెరుగుదలతో పాటు మొక్కలు అభివృద్ధి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈయన వెంట అటవీ శాఖ అధికారులు ఎండీ నజీర్ ఖాన్, స్వప్నలతో పాటు సిబ్బంది ఉన్నారు.

అదుపు తప్పిన కారు.. తృటిలో తప్పిన ప్రమాదం

కుంటాల, మార్చి, 13 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు - కుంటాల రహదారిపై అందకూర్ సమీపంలో కారు అదుపుతప్పి ప్రమాదం తృటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే కుంటాల యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న సచిన్ బ్యాంకు విధులు ముగించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో అందకూర్ సమీపంలో మూలమలుపువద్ద కారు అదుపుతప్పి పంట చేనులోకి దూసుకపోయింది. కారులోని బెలూన్ తెరుచుకోవడం మేనేజర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేత

ఖానాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 1981-82 పదవ తరగతి బ్యాచ్ బృందం ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 1981-82 విద్యా సంవత్సరం 10వ తరగతి మిత్రబృందం సభ్యులు జి. కిషన్ రెడ్డి, శ్రీనివాస్, ముత్యం, నరేష్, రాజేందర్, గంగాసాగర్, జీవన్, విశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజలింగం, తదితరులున్నారు.

మా ఊరు వెళ్లే దారికి ఫారెస్ట్ అనుమతులు ఇవ్వండి..

● రెండు రోజులుగా చెట్లని నరుకుతూ నిరసన తెలుపుతున్న గ్రామస్థులు ● చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు
● డీఎఫ్‌వో వచ్చినా కూడా సఫలం కాని చర్చలు ● పరిష్కరించే వరకూ ఇదే తంతు అంటున్న గ్రామస్థులు



హరితవనంలో నరికిన మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నాగిని భాను

దస్తురాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునిగూడెం గ్రామస్థులు తమ గ్రామ సమస్యలను ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా నాటిన లక్ష మొక్కల ప్లాంటేషన్‌లో గత రెండు రోజులుగా హరితవనంలోని మొక్కలను నరుకుతున్నారు. గ్రామంలోని గ్రామదేవత అయినటువంటి నల్లపోచమ్మ ఆలయానికి రెండు గుంటల భూమిని కేటాయించాలని, అదే విధంగా ప్రధాన రహదారి నుండి గ్రామానికి వచ్చే దారికి ఫారెస్ట్‌శాఖ అనుమతులు ఇవ్వాలని ఫారెస్ట్ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఫారెస్ట్ అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ కూడా పట్టించుకోవడం లేదని ఆవేదనతో ఇలా చేయాల్సి వస్తుందని వారు తెలుపుతున్నారు. విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా డీఎఫ్‌వో నాగిని భాను గురువారం కేసీఆర్ హరితవనాన్ని సందర్శించి గ్రామస్థులతో చర్చలు జరిపారు. కాగా చర్చలు సఫలం కాలేదు. గ్రామానికి రోడ్డు సమస్య, ఆలయానికి స్థలం కేటాయించే వరకు చెట్లను ధ్వంసం చేస్తూనే ఉంటామని గ్రామస్థులు తెలిపారు. ఈ కారయక్రమంలో నిర్మల్ డీఎఫ్‌వో, ఖానాపూర్ ఎఫ్‌డీవో, నిర్మల్ జిల్లాలోని అన్ని రేంజ్ పరిధిలోని అధికారులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌రెడ్డి తక్షణమే స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి

● కాంగ్రెస్ ఖానాపూర్ పట్టణ శాఖ డిమాండ్ ● ఖానాపూర్‌లో జగదీశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీ దగ్ధం చేసి నిరసన



ఖానాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత జగదీశ్వర్‌రెడ్డి తక్షణమే తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ పట్టణ శాఖ డిమాండ్ చేసింది. గురువారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో స్పీకర్ పట్ల మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై నాయకులు మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళిత సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తూ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టడాన్ని మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత జగదీశ్వర్‌రెడ్డి అగ్రకుల అహంకారంతో ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. జగదీశ్వర్‌రెడ్డి స్పీకర్ పట్ల వ్యవహరించిన అహంకార పూరిత వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆయన దిష్టిబొమ్మను దహనం చేయాల్సిందిగా పిలుపునిచ్చారని పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు తాము ఖానాపూర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగా నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జన్నారపు శంకర్, ధ్యావతి రాజేశ్వర్, సార్ల నర్సయ్య, నేత శ్యామ్, రఘుపతి రెడ్డి, మేదరి రాజేశ్వర్, మైస శ్రీనివాస్, రమేష్, నహీం, తదితరులున్నారు.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రధాన రహదారిపై గురువారం మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి శవయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్ మాట్లాడుతూ... దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పైన చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆయన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జగదీశ్వర్ రెడ్డిని ఎమ్మెల్యేగా బర్తరఫ్ చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు గుండా నరేష్, సీనియర్ నాయకులు ఫుల్యా నాయక్, మహేందర్ రెడ్డి, మోతే రమేష్, రంజిత్, సురేందర్, కుమార్, కొమురయ్య, కిరణ్, శ్రీధర్, రాజేందర్, శ్రీను, రాజం, నరేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కడెం మండల కేంద్రంలో..

కడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో అభివృద్ధిపై చర్చిస్తున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కడెం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడెం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూమన్న, జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రమేష్‌వర్మ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మండల నాయకులు ముస్కు రాజు, బబ్లు, రఫీక్, యాదగిరి, నారాయణ, జలజ, దేవేందర్ గౌడ్, రాజన్న, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

కక్షపూరితంగా వ్యవహరించిన అటవీశాఖ

అధికారులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు

ఖానాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగంపేట, కొత్తగూడెంలో ఒక కుటుంబంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఖానాపూర్‌లో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ ఆధ్వర్యంలో నిరసన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కొత్తగూడెంలో భూపోరాటం చేసి సాధించుకున్న భూమిలో 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. కాగా ఖానాపూర్ ఎమ్మార్వో పేరిట రెండు నోటీసులను ఇచ్చి ఏడవ తేదీ నాడు గ్రామానికి చెందిన స్వామి నివాసం ఉంటున్న గుడిసెను కూల్చి వేయడం సమంజసం కాదన్నారు. అటవీ అధికారులు చేసిన చర్యలతో స్వామి కుటుంబం రోడ్డున పడిందన్నారు. వెంటనే ఈ ఘటనకు కారకులైన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎఫ్‌డీవో కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ డివిజన్ నాయకులు లింగన్న, ప్రసాద్, స్వామి, శేఖర్, గంగన్న, కైలాస్, శ్రీనివాస్, చంద్రకళ, సావిత్రి, తదితరులున్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసనను జయప్రదం చేయండి

ఖానాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించడంతో పాటు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్‌తో ఈ నెల 17, 18వ తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. గురువారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ఐసీడీఎస్‌కు నిధులు కేటాయించడంతో పాటు అంగన్‌వాడీ టీచర్స్, మినీ టీచర్స్, హెల్పర్స్ సమస్యను పరిష్కరించేలా వారికి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నెల 17, 18న అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా, వంటావార్పు, రాత్రి బస కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ 48 గంటల నిరసన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఖానాపూర్ ప్రాజెక్టు కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షురాలు రాణి, తదితరులున్నారు.

చెక్ డ్యామ్‌ను నిలిపి వేయాలని విజ్ఞప్తి

సోన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాఫ్రాపూర్ గ్రామంలో గల స్వర్ణ నదిపై నిర్మించ తలపెట్టిన చెక్ డ్యామ్ నిలిపి వేయాలని నీటి పారుదల శాఖ అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినట్లు గ్రామ వీడీసీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత నాలుగు సంవత్సరాలుగా వస్తున్న వరదల కారణంగా మా గ్రామంలో పంట నష్టం, ఇళ్లలోకి నీరు వచ్చి చాలా నష్టం జరిగిందని, దానిని దృష్టిలో ఉంచుకొని ఇట్టి నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



వాసవి పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



చిన్నారితో హోలీ ఆడుతున్న పాఠశాల ప్రిన్సిపాల్



శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు

నిర్మల్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్, వాసవి ప్రైమరీ పాఠశాలలో వేరువేరుగా ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రకృతి సిద్ధమైన రంగులు చలుకుంటూ హోలీ సంబరాలు జరుపుకుంటూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యానికేతన్ ప్రధానోపాధ్యాయులు శ్యామ్ ప్రకాష్, వాసవి పాఠశాల సెక్రటరీ జగదీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయ హైస్కూల్‌లో..

నిర్మల్ కల్చరల్: పట్టణంలోని విజయ హైస్కూల్‌లో గురువారం ముందస్తు హోలీ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థులు సహజ రంగులు చల్లుకొని సంబరాల్లో పాల్గొన్నారు. రసాయన రంగులతో కలిగే దుష్ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు.

వశిష్ట ఇంపెల్స్‌లో..

నిర్మల్‌లోని ఆదర్శనగర్ వశిష్ట ఇంపెల్స్ టెక్నో స్కూల్‌లో గురువారం ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు రంగులు చల్లుకొని ఉత్సాహంగా గడిపారు. హోలీ పండగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని పాఠశాల చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ గొల్లపల్లి అన్నారు. ప్రిన్సిపాల్ మాధవి గొల్లపల్లి, డైరెక్టర్ దేవిదాస్, ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



ఒకరికొకరు రంగులను చల్లుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఒకరికొకరు రంగులను పూసుకుంటున్న విద్యార్థులు



రంగుల పండగలో విద్యార్థులు



ముందస్తు హోలీ వేడుకల్లో విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలో హోలీ సంబురాలు

దస్తురాబాద్ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం హోలీ పండగ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఉత్సాహంగా సాంప్రదాయ రంగులను చల్లుకున్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు హోలీ పండగ శుభా కాంక్షలు తెలిపారు.

లక్ష్మణచాందలో ఘనంగా హోలీ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో హోలీ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద పెద్ద డ్రమ్ముల్లో కలర్స్ కలిపి ప్రధాన వీధులగుండా తిరుగుతూ రంగోళి నిర్వహించారు. ఒకరిపై మరొకరు రంగులు పోసుకుని తమ ఉత్సాహం కనబరిచారు. ఈ ఉత్సవంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, తాజా మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నాయకులు కల్లెడ భూమన్న, దశరథ్, పోశెట్టి, యువతి యువకులు, మహిళలతో పాటు వృద్ధులు సహితం పాల్గొన్నారు.

సహజ రంగులతో హోలీ పండగ

సోన్: మండలంలోని కడ్తాల్ ఎంపీపీఎస్ పాఠశాల యందు గురువారం ముందస్తు హోలీ పండగను జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు హోలీకి సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకొని హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. మోదుగ చెట్ల నుంచి తెంపిన పువ్వులను ఉడకబెట్టి రంగును తయారు చేశారు. సహజ సిద్ధమైన చెట్ల ఆకుల నుండి తీసిన ఆకుపచ్చ కలర్‌ను, పసుపు వంటి పదార్థాలతో తయారు చేసి కలర్స్‌ను ఉపయోగించి హోలీ పండగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి రమేష్ బాబు, ఉపాధ్యాయులు మంగమ్మ, రాధ, విజయ, వాణి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సహజ సిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవాలి

భైంసా, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : హోలీ వేడుకల్లో రసాయనాలతో చేసిన రంగులు కాకుండా సహజ సిద్ధమైన రంగులనే వినియోగించాలని భైంసా మండలం మహాగాం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. గురువారం పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్.కృష్ణ ఆధ్వర్యంలో మోదుగ పువ్వులతో సహజ సిద్ధమైన రంగును తయారు చేసారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవిదాస్, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, ఎన్.కృష్ణ, హరీష్, రాణిల నేతృత్వంలో విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి రసాయన, కృత్రిమ రంగుల వాడకం ద్వారా జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సహజ సిద్ధమైన రంగుల వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధాన కూడలీల్లో మోదుగ పువ్వులతో రంగులు తయారు చేసి పంపిణీ చేశారు. గ్రామ యువజన సంఘాలతో భేటి అయ్యి రసాయన రంగులు కాకుండా సహజ సిద్ధమైన రంగులనే వినియోగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



మోదుగ పువ్వులతో రంగును తయారు చేస్తున్న విద్యార్థులు



తర్లపాడ్ గ్రామంలో కోలాలు ఆడుతున్న చిన్నారులు

ఘనంగా కామ దహనం

ఖానాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం రాత్రి కామ దహనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో కామ దహనాన్ని నిర్వహించారు. గత వారం రోజులుగా చిన్నారులు గ్రామాల్లో ఆడిన కోలాలతో సహా ఆవు పేడతో చేసిన పిడకలను కామ దహనం సందర్భంగా దహనం చేశారు. కామ దహనాన్ని పురస్కరించుకొని పలువురు పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని విద్యానగర్ సహా పలు కాలనీల్లో, ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమానికి చిన్న పెద్ద అనే తేడా లేకుండా పలువురు హాజరై పూజలు నిర్వహించారు.

ఖానాపూర్: మండలంలో గురువారం రాత్రి కామ దహనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో కామ దహనాన్ని నిర్వహించారు. గత వారం రోజులుగా చిన్నారులు గ్రామాల్లో ఆడిన కోలలతో సహా ఆవు పేడతో చేసిన పిడకలను కామ దహనం సందర్భంగా దహనం చేశారు. కామ దహనాన్ని పురస్కరించుకొని పలువురు పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని విద్యానగర్ సహా పలు కాలనీల్లో, ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమానికి చిన్న పెద్ద అనే తేడా లేకుండా పలువురు హాజరై పూజలు నిర్వహించారు.



కామ దహనం సందర్భంగా ప్రతీ ఇంటింటికి మంగళహారతితో వెళ్తున్న చిన్నారులు

సంప్రదాయ రీతిలో..

భైంసా : పట్టణంలో కామదహన వేడుకలు గురువారం రాత్రి సంప్రదాయ రీతిలో ఘనంగా జరిగాయి. వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన కామునికి ఆయా ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ప్రత్యేక పూజలు చేపట్టి దహన కార్యక్రమాలు నిర్వహించి హోళి పర్వదిన వేడుకలను ప్రారంభించారు. పట్టణంలోని కాలనీలన్నింటిలోను కామదహన వేడుకలను ఆయా ప్రాంతవాసులు భక్తి శ్రద్ధల మధ్య సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. కామదహన అనంతరం అందులోని నిప్పురవ్వలను ఇంటికి తీసుకవెళ్లి శనగలను కాల్చుకొని ప్రసాదంగా స్వీకరించారు.



భైంసాలోని సాయినగర్ కాలనీలో కామదహనం



భైంసాలో కామదహనం పూజలు నిర్వహిస్తున్న సాయినగర్ కాలనీవాసులు

ఇంటింటికీ కుడుకల సేకరణ

ఉట్నూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకల సందర్భంగా ఏజెన్సీలోని ఆదివాసీ గ్రామాల్లో గురువారం దురాడి సంబరాలు ఘనంగా జరిగాయి. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయబద్ధంగా దురాడి సంబరాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఆదివాసీ గ్రామాల్లో పేటల్, దేవరీల ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో ని కూడళ్లలో ఆదివాసీ గిరిజనులు సమావేశమయ్యారు. ఉట్నూర్ మండలంలోని ఘన్‌పూర్, కొత్తగూడజి, కల్లూరిగూడ, చింతగూడ, శంభుగూడ, సుద్దగూడ, లక్కారం, దేవుషాగూడ, దుర్గాపూర్, వంకతుమ్మ, రాజులమడుగు, ఉమాపతికుంట, గంగాపూర్, మారుగూడ, లక్షేటిపేట, కామాయిపేట తదితర గిరిజన గ్రామాల్లో గ్రామస్థులందరూ ప్రతీ కుటుంబం నుంచి పటేల్ వద్దకు కుడుకలు చక్కెరపేర్లు పంపించారు. దూర ప్రాంతంలో ఎక్కడ ఉన్న దురాడి పండుగకు స్వగ్రామానికి ప్రతీఒక్కరు చేరుకొని తమ కుటుంబం నుంచి కుడుకలు ఇవ్వాల్సిందేనని ఆదివాసీ గిరిజనుల సాంప్రదాయం. ఈ సాంప్రదాయానికి అనుగునంగా గిరిజనులందరూ నేటికి నడుచుకుంటున్నారని మాజీ ఎంపీపీ పంద్రజైవంత్‌రావు తెలిపారు. ప్రతీ గ్రామంలో గ్రామస్థుల నుంచి సేకరించిన కుడుకలు చక్కెర పేర్లతో, మోదుగు పూల దండలు కట్టి వెదురుబొంగులకు మాతరి,మాత్రలను తయారుచేసి సాంప్రదాయ వాయిద్యాల మధ్య గిరిజనులందరూ గ్రామ పొలిమేరకు చేరుకొని కామ దహనం నిర్వహిస్తారు. ఈ కామ దహనం ఆదివాసీ గిరిజనుల సాంప్రదాయపద్ధతుల్లో నిర్వహించి మాతరి, మాత్రలను దగ్ధం చేస్తారు. మంటలపై నుంచి దూకుతూ దుడారి సంబరాలు నిర్వహించుకొని మరుసటి ఉదయం హోలీ సంబరాలు నిర్వహించుకోవడం కొనసాగుతూవస్తుంది.



ఆదివాసీ గ్రామాల్లో దురాడి సంబరాలు



ఆదివాసీ గ్రామాల్లో కామదహనం నిర్వహిస్తున్న దృశ్యం

సంప్రదాయంగా కామదహనం

ఇంద్రవెల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన గ్రామాల్లో హోలీ పండుగను పురస్కరించుకొని ఆదివాసీ గిరిజన సంప్రదాయ ప్రకారం కామ దహనం చేశారు. గురువారం సాయంత్రం కామున్ని దహనం చేసి హోలీ పండుగకు శ్రీకారం చుట్టారు. ఆదివాసీ గిరిజన గ్రామంలో ప్రతీ కుటుంబానికి చెందిన వారు తమ సంస్కృతి సంప్రదాయం ప్రకారం కుడుకలు, చక్కెర బిళ్లల హారాలను తీసుకొని గ్రామపటేల్ ఇంటికి చేరుకున్నారు. పటేల్ ఇంటి ముందర కొంతమంది గిరిజన పెద్దలు కుడుకలు, చక్కెర బిళ్లల హారాలను సేకరించారు. ఆదివాసీ గిరిజన ప్రతీ కుటుంబ యజమాని ఉదయం పూట సమావేశమై కుటుంబానికి ఒక కుడుకను ఊరి పటేల్‌కు అందిస్తారు. గ్రామ పొలిమేరలో కామ దహనం అనంతరం వాయిద్యాలు వాయిస్తూ గిరిజన సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమక గ్రామ పటేల్ పెందూర్ భగ వంత్ రావ్, మహా రాజ్ యశ్వంత్‌రావ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామంలో కుడుకలు, చక్కెర బిళ్లల హారాలను సేకరిస్తున్న ఆదివాసీ గిరిజనులు

కన్నుల పండువగా వసంతోత్సవ వేడుకలు



ఉత్సవమూర్తులకు చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



మహా పూర్ణాహుతిని నిర్వహిస్తున్న వేద పండితులు

భైంసా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి 19వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు భక్తుల కోలహలం మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకలలో భాగంగా గురువారం నిర్వహించిన వసంతోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం వేళలో వేదపండితులు ఆలయ ప్రాంగణంలో మహా పుర్ణాహుతిని మంత్రోశ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ యాగశాల చుట్టూ భారీ సంఖ్యలో ప్రదక్షిణలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేళలో ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు శోభయాత్ర నిర్వహించారు. సుదర్శన పెరుమాళ్ల మూర్తికి బ్రహ్మ కలశంతో ఆలయ ప్రాంగణంలో భాజభజంత్రీలతో మధ్య ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులకు వసంతోత్సవ వేడుకలు నిర్వహించారు.

సొంత కార్యాలయాలు లేక ఇబ్బందుల్లో సిబ్బంది

● ఇదీ గాదిగూడ మండల పరిస్థితి ● ప్రభుత్వ సొంత భవనాలు నిర్మాణం కోసం ప్రజల డిమాండ్

నార్నూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడి ప్రజలు కోరిక ఉన్న డిమాండ్ ప్రత్యేక మండలం కావాలని ఆశని గత కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చింది. నార్నూర్ మండలం నుంచి గాదిగూడ వేరుగా చేసి మండలంగా ప్రకటించి అక్కడి ప్రజలు ఇబ్బందికి గురి కాకుండా నూతన ప్రభుత్వ సేవలు ప్రారంభించింది. ఈ అంశంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు ఆదివాసీ ప్రజలు. ఇక్కడి వరకు సరే కని ముఖ్యంగా ప్రభుత్వ శాఖలు తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, మరిన్ని కార్యాలయానికి సొంత భవనలు లేక గతంలో నిర్మించిన పలు పాత భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. పాత గ్రామ పంచాయతీ భవనంలో తహసీల్దార్ కార్యాల యం, ఎంఆర్‌సీలో మండల పరిషత్, పాత వసతి గృహంలో పోలీస్ స్టేషన్ కార్యాలయాలు ఉన్నాయి. కానీ విధులు హాజరు అయ్యే అధికారి సిబ్బందికి ఇబ్బంది జరిగిన నిశ్శబ్దంగా విధులు ఆటంకం కలగకుండా పనులు చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు వ్యవస్థ బాగు లేదు అధికారులకు సొంత కార్యాలయ భవనాలు లేక పోవడంతో మరింత గామ మండలం మొత్తానికి వెనుకబడి పోతుందని ఇక్కడ ఆదివాసీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాంత ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా గాదిగూడ మండలానికి పెద్ద ఎత్తున సహకారం అందించి అభివృద్ధి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.




పాత ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల పరిషత్ కార్యాలయం

నాడు కనువిందు.. నేడు కళా విహీనం!


ఫొటో న్యూస్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సహజంగానే గ్రామాలు, అటవీ ప్రాంతాలు రుతువులకు అను గుణంగా మారుతూ మనకు కని పిస్తుంటాయి.. వర్షాకాలం గుట్టలు, అడవులు పచ్చ దనంతో శోభించి పోతాయి.. కానీ మండుటెండ కాలం చూస్తే.. ఆ ప్రాంతాన్ని పోల్చుకోలే నంతగా కళా విహీనమై బోసి పోయి కనిపిస్తాయి.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల అటవీ ప్రాంతం అందాలు.. నాడు వర్షాకాలంలో పచ్చదనంతో కనువిందు చేయగా.. ప్రస్తుతం వేసవి కాలంలో మండుటెండలకు ఇలా కళా విహీనంగా కనిపిస్తున్న చిత్రమిది.





నేడు కళా విహీనంగా బోసి పోయి కనిపిస్తున్న ఖండాల అటవీ ప్రాంతం



నాడు పచ్చదనంతో కళకళలాడుతున్న ఖండాల అటవీ ప్రాంతం

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.8 : కనిష్ఠం 22.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 14 మార్చి 2025





వడ్డీ వ్యాపారుల ఇష్టారాజ్యం!

- జిల్లాలో అడ్డగోలుగా ఫైనాన్స్ వ్యాపారుల దందా
- అన్నదాతల అవసరాలను ఆసరా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులు
- ఆశించిన దిగుబడులు రాక దిక్కులు చూస్తున్న రైతులు
- పెరిగిపోతున్న ఒత్తిళ్లు.. బలితీసుకుంటున్న అప్పులు
- గతిలేక పురుగుల మందు, ఉరితాళ్లను ఆశ్రయిస్తున్న రైతులు
- నెల రోజుల్లోనే నలుగురు రైతుల బలవన్మరణం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ఆదిలాబాద్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వడ్డీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని దోపిడీకి ఎగబడుతున్నారు. పంటల సాగు, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేస్తున్న రైతులు ఆశించిన దిగుబడులు రాకపోవడంతో దిక్కులు చూస్తున్నారు. అప్పులు తీర్చాలంటూ వ్యాపారులు ఒత్తిళ్లు చేయడంతో దిక్కుతోచని స్థితిలో పురుగుల మందు, ఉరితాళ్లను ఆశ్రయిస్తూ ఉసురు తీసుకుంటున్నారు. అప్పుల భారంతో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పత్తి, కంది, శనగ, ఇతర పంటలు చేతికి రావడంతో అప్పులు తీర్చాలంటూ వ్యాపారులు ఒత్తిళ్లు చేస్తున్నారు. దీంతో గడిచిన నెల రోజుల్లోనే రెండు కుటుంబాలకు చెందిన నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడి ప్రాణాలు తీసుకున్నారు. తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన కుటుంబం అప్పుల భారంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిని మరిచి పోకముందే నేరడిగొండ మండలం వడూర్ గ్రామానికి చెందిన దంపతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. వాతావరణ, కుటుంబ పరిస్థితులు అనుకూలించక పోవడంతో అన్నదాతల అంచనాలు తారుమారవుతున్నాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అయితే ఎలాంటి నిబంధనలు పాటించకుండానే వ్యాపారులు ఆర్థిక లావాదేవీలను సాగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో వడ్డీ వ్యాపారం బ్యాంకుల తరహాలో కొనసాగుతోంది. ఇదంతా అధికారులకు తెలిసినా అడుకట్ట వేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అధిక వడ్డీ వసూలు

అవసరానికి అప్పులు చేస్తున్న రైతు కుటుంబాల వద్ద బలవంతంగా అధిక వడ్డీలను వసూలు చేస్తున్నారు. పెట్టుబడి ఖర్చుల కోసం అప్పులు చేస్తున్న రైతులకు పంట దిగుబడులు చేతికి రాగానే అప్పుల వేదింపులు పెరిగి పోతున్నాయి. పండించిన పంట వడ్డీకి కూడా సరిపోక పోవడంతో అప్పుల భారం మరింతగా పెరుగుతోంది. ఏటా అప్పుల కుప్ప పెరిగిపోవడంతో మనోవేదనకు గురై పంటల సాగుపై కూడా సరైన దృష్టిని సారించడం లేదు. తీవ్రమైన ఒత్తిళ్లతో సతమతమవుతూ ఎవరికి చెప్పుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. కొంత మంది దళారులు 5 నుంచి 25 శాతం వరకు వడ్డీని వసూలు చేయడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి. పోలీసు స్టేషన్ల వరకు వెళ్తున్న కొంత మంది అధికారులే సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. పంట చేన్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటు అప్పులు ఇవ్వడంతో ఇబ్బంది కర పరిస్థితులకు దారితీస్తోంది. దీంతో వ్యాపారులు చెప్పిందే లెక్కాగా మారుతోంది. కాదు కూడదంటే భూమిని తిరిగి ఇచ్చేది లేదంటూ వ్యాపారులు బెదిరింపులకు దిగుతున్నారు.

పెరిగిపోతున్న వేధింపులు

పంట చేతికి వచ్చిన సమయంలోనే వేధింపులు పెరిగిపోతున్నాయి. అరకొరగా వచ్చిన దిగుబడులతో అప్పు తీర్చలేక అత్యవసరాలను తీర్చుకోలేక అన్నదాతలు సతమతమవుతున్నారు. వచ్చిన ఆదాయంతో అప్పులు, వడ్డీల అంచనాలు వేసుకుంటూ ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలోనే అప్పులు ఇచ్చిన దళారి వ్యాపారులు నిత్యం వేధించడం మొదలు పెడుతున్నారు. వడ్డీ వ్యాపారులు ఇంటి ముందుకు వచ్చి బైఠాయించడంతో గ్రామంలో పరువుపోతుందన్న భయంతో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొందరు వ్యాపారులైతే మానసికంగా, శారీరకంగా రైతులను ఒత్తిళ్లకు గురిచేయడానికి కూడా వెనకడుగు వేయడం లేదంటున్నారు. తమ ప్రతినిధులతో బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో అప్పు చెల్లించని యెడల తీవ్రమైన దుర్భాషలాడుతూ వివిధ రకాలుగా ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు. కొంత సమయం ఇవ్వాలని ఎంత వేడుకున్నా వినకపోవడంతో గతిలేక కళ్ల ముందు కనిపించకుండానే పోతున్నారు.

కట్టడి చర్యలు చేపట్టని అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్న జిల్లాలో ఎక్కడ అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. యథేచ్ఛగా వడ్డీ వ్యాపారం దందా కొనసాగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం తేలికగానే తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అప్పుల బాధ తట్టుకోలేక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్న బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో దిక్కుతోచని స్థితిలో పడుతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కనీసం మానవీయ కోణంలోనైనా సహకరించే ప్రయత్నం చేయడం లేదంటున్నారు. యేటా పంట చేతికి వచ్చిన సమయంలోనే అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలు జరుగుతున్నా క్షేత్ర స్థాయిలో అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం లేదు. ఆపదలో ఉన్న వారికి మేమున్నామనే భరోసాను కల్పిస్తే కొంత మంది ప్రాణాలైన దక్కేవి. గతంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కిసాన్‌సెల్‌ను ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించే ప్రయత్నం చేసిన ప్రస్తుతం అలాంటి చర్యలు కనిపించడం లేదు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు చెబుతున్నారు. మండల స్థాయిలో రైతుల ఇబ్బందులు, కష్టసుఖాలను చెప్పుకునే విధంగా ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేస్తే కొంత వరకైనా ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇతరులకు ఇబ్బందులు కలగకుండా హోలీ జరుపుకోవాలి

● జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



బోథ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బోథ్, బజార్‌హత్నూర్ పోలీస్‌స్టేషన్లను గురువారం ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట బోథ్ పోలీస్ స్టేషన్‌లోకి రాగానే పోలీసుల గౌరవ వందనం అనంతరం ఎస్పీకి మొక్కను అందించి సీఐ వెంకటేశ్వరరావు స్వాగతించారు. అనంతరం ఎస్పీ స్టేషన్‌లోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సం దర్భంగా పోలీసుస్టేషన్‌లోని వాహనాల కండిషన్‌ను సీఐ, ఎస్సై ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, బోథ్ ఎస్సైతో పాటు బజార్‌హత్నూర్ ఎస్సై అప్పారావు, ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డిలున్నారు. అంతేగాక మహారాష్ట్ర తెలం గాణ సరిహద్దుల్లోని ఘన్‌పూర్ చెక్‌పోస్టును ఎస్పీ సందర్శించి అక్రమ రవాణా జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ఆదిలాబాద్ :ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నదులు, వాగులు, చెరువుల వద్ద ఈత రాని వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇతరుల అనుమతి లేకుండా ఎలాంటి రంగులను చల్లడం, పూయడం చేయరాదన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడుపకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి జాగ్రత్త వహించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలన్నారు.

ఎస్పీని కలిసిన కంది...

ఆదిలాబాద్ : జిల్లా ఎస్పీగా పదవీబాధ్యతలు చేపట్టిన అఖిల్ మహాజన్‌ను ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం పార్టీ నేతలతో కలిసి జిల్లా ఎస్పీకి పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు.

ఆదిలాబాద్ రూరల్ : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను గురువారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో కలిశారు. మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు తడిసెన వెంకట్ రెడ్డి, అట్ల గోవర్ధన్ రెడ్డి, నలి మెల నవీన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అలిశెట్టి నాగన్న, మాజీ సర్పంచ్ రతన్ మర్యాద పూర్వకంగా కలిశారు.

కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లు తీసుకోవాలి

● అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

మావల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతివస్తువుకు తప్పనిసరిగా జీఎస్టీతో కూడుకున్న బిల్లును తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. గురువారం ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే, గురుకుల కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం జిల్లా అధ్య క్షుడు సంతోష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్	సహర్
సా.6.31	ఉ.5.02



తలబిరుసుగా వ్యవహరించడం, ప్రాపంచిక జీవితానికే ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తి నివాసము నరకమే అవుతుంది.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన అవసరం : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఉట్నూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్ల ద్వారా ఇంటర్‌నెట్‌లో అశ్లీల (పోర్న్) వీడియోలు సెర్చ్‌చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాల సంఖ్య పెరిగి పోతుందని అన్నారు. బీహార్‌కు చెందిన ముఠా గ్రామీణ ప్రాంతాలలో పర్యటిస్తూ 2500 పాత సెల్‌ఫోన్లను కొనుగోలు చేసిందన్నారు. ఇంట్లో చెడిపోయిన పాత సెల్‌ఫోన్లను కొందరు అమాయకులు సిమ్‌కార్డు ఉంచి అమ్ము కోవడంతో పాటు, తీసి అమ్మినా సెల్ ఫోన్‌లోని ఐఎంఈఐ కోడ్‌ద్వారా సెల్‌ఫోన్ యజ మానులపై కూడా కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. ఇంట్లో పడి ఉన్న పాతసెల్‌ఫోన్‌లను ఎవరు కూడా అమ్ముకోవద్దన్నారు. బాలికలపై ఆత్యాచారాలు నిరోధించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అదనపు డీజీ కార్యాలయాన్ని రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు చేసిందన్నారు. ఎవరైన సెల్‌ఫోన్లలో అశ్లీల వీడియోలు సెర్చ్ చేసినట్లయితే సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం రాగానే సెర్చ్‌చేసిన వ్యక్తులపై కేసులో నమోదు అవుతాయన్నారు సమావేశంలో సీఐ గండి కోట మొగిలి, ఎస్సై మనోహర్ ఉన్నారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీవో

ఉట్నూర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డీడీ, ఏపీవో జనరల్ జాదవ్‌వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులకు మెరుగైన పద్ధతిలో పరీక్షలు ఎలా రాయాలో ఉపాధ్యాయులు వివరించాలన్నారు. ఇప్పటికే 10వ తరగతి విద్యార్థుల కోసం పుస్తకాలు, కావాల్సిన సామగ్రిని అందించామన్నారు. ప్రత్యేక తరగతులు తీసుకొని పరీక్షలకు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో క్రాంతికుమార్, ప్రధానోపా ధ్యాయులు మల్కు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బానోత్ యశోదలున్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సోనాల మండల కేంద్రానికి చెందిన కాం గ్రెస్ పార్టీ నాయకులు, ఏఐసీసీ విచారణ రాష్ట్ర కన్వీనర్ తులఅరుణ్ కుమార్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి నియోజకవర్గంలోని పలువురు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రంలో శిథిలమైన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను పునర్ నిర్మించాలని, నూతనంగా ఏర్పడిన సోనాల మండల కేంద్రంలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంత్రికి విన్నవించినట్ల ఆయన పేర్కొన్నారు. స్పందించిన మంత్రి త్వరలోనే ఆయా పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

'లైసెన్సులు రద్దు చేయండి'

ఉట్నూర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): జైనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఉట్నూర్ మండలంలో పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలని ఆదిమ గిరిజన కోలాం సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి సిడాంబాబురావు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలలో ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనేతరులకు పంట కొనుగోలు లైసెన్సులు ఇవ్వరాదని అన్నారు.

అంతటా కామదహనం



పట్టణంలో కామదహనం

ఆదిలాబాద్ అర్బన్, మార్చ్14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం కామదహనం నిర్వహించారు. శుక్రవారం ఆనందోత్సవాలతో హోలీపండుగను నిర్వహించుకునేందుకు చిన్నాపెద్ద సిద్ధమయ్యారు. హోలీ పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో రాత్రి వీధి వీధినా భక్తి శ్రద్ధలతో కామ దహనం చేశారు. అటు జిల్లాలోని గ్రామాల్లోనూ భక్తి శ్రద్ధలతో ప్రజలు కామ దహనం నిర్వహించి కాముని చుట్టూ నృత్యాలు చేశారు. గోపాలకృష్ణ మఠంలో నిర్వహించిన కామదహన కార్యక్రమంలో పలువురు పాల్గొని ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కామ దహనం చేసి అందరికీ రంగుచల్లారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద, తాటిగూడ, విద్యానగర్, రవీంద్రనగర్, ద్వారకనగర్, రాంనగర్ ప్రాంతా ల్లో కట్టెలతో పేర్చిన కామున్ని ప్రముఖులు, పలువురు వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి మేళతాళాల మధ్య దహనం చేశారు. గ్రామాల్లో పేడ పిడికెలతో పేర్చిన కామున్ని ఊరుఊరంతా ఒక్కటై దహనం చేశారు. దీనికి చిన్నలు, పెద్దలు అధికసంఖ్యలో హాజరయ్యారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలబోరి ప్రాజెక్టులో తగ్గిన నీటి నిల్వలు

బోథ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలబోరి ప్రాజెక్టులో నీటి నిలువలు భారీగా పడిపోయాయి. దీంతో ప్రాజెక్టు కింది భాగం నుంచి ప్రవహించే వాగు ప్రవాహం లేకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఫలితంగా వాగుల్లో నీరులేక పోవడంతో పశువులకు తాగేందుకు నీటిఎద్దడి ఎదురవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోనాల గ్రామానికి చెందిన పలువురు గురువారం ప్రాజెక్టు వద్ద నీటినిలువ పరిశీలించారు. తూము వద్ద నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో వాగులోకి నీరు రావడం లేదని గ్రామస్తులు గమనించారు. వాగులో నీటిని విడిచి పెట్టినట్లయితే భూగర్భజలాలు పెరగడంతో పాటు పశువులకు నీటి ఎద్దడి ఆస్కారం ఉందని గ్రామస్తులు అంటున్నారు. అంతేగాక వాగులో నుంచి నీటిని కొంతమంది రైతులు పంటలు సాగుచేసుకునేందుకు వాడుకుంటున్నారని, ఫలితంగా నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని అంటున్నారు.

'వైద్యుల సూచన మేరకే మందులు వాడాలి'



కేక్ కట్‌చేస్తున్న రిమ్స్‌డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల సూచనలు లేకుండా పెయిన్‌కిల్లర్ మాత్రలు వేసుకోవద్దని, ఇష్టమొచ్చినట్లు మాత్రలు వాడితే కిడ్నీపై ప్రభావం చూపుతుందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రంలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరై డైరెక్టర్ ముందుగా కేక్‌కట్ చేసి తినిపించారు. అనంతరం డయాలసిస్ కేంద్రంలో ఉన్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరి స్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ ఎలాంటి ప్రిసిప్షన్ లేకుండా నొప్పి మందులను వాడొద్దని సూచించారు. ఇష్టారీతిన మందులను వాడడం వల్ల కిడ్నీపై ప్రభావం చూపి సమస్యలు వస్తాయన్నారు. ఇప్పటికే రిమ్స్‌లో 97 మంది నిత్యం డయాలసిస్ చేసుకుంటున్నారన్నారు. ఆరోగ్యం మన చేతుల్లో ఉందని దాన్ని కాపాడుకోవాలన్నారు. నిత్యం యోగాతోపాటు ఆహార అలవాట్లను మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ అశోక్, ఆర్ఎంఓ చందు, డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి రాథోడ్ ప్రేమాస్, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు : నరేందర్



మిషన్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో లింగ నిర్ధారన చేస్తే చర్యలు తప్పవని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. డయాగ్నోస్టిక్ కేం ద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. స్కానింగ్ వివరాలు, ఇతర వాటిని పరిశీలించి కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ సాధన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. హ్యాండిల్ ఎక్స్‌రే మిషన్‌ను అందించడం అభినందనీయమని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం క్షయ నియంత్రణ కేంద్రంలో సుశోధన స్వచ్ఛంద సంస్థ రూ.20 లక్షల విలువల గల హ్యాండిల్ ఎక్స్‌రే మిషన్‌ను డీఎంహెచ్ఓకు అందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని గురువారం కలిశారు. నేషనల్ హైవే 44 నుంచి మహోర్ వయా జందాపూర్, భీంపూర్, అర్లి, కరంజి, మాండ్వి, సర్కాని, మహోర్ వరకు జాతీయ రహదారిగా గుర్తించాలని కోరారు. అలాగే నేషనల్ హైవే 44ను జాతీయ రహదారిగా మార్చాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.